# వేటగాడు

సాదనాల వెంకటస్వామినాయుడు

వెంకట్రాజు వీధి అరుగుమీద వాలు కుర్చీలో కూర్చుని పేపర్ చదువుతున్నాడు.

"బావ్, ఎంకట్రాజు బావ్, అడవి పందులు పెనగసేల్ని దున్నేత్తున్నాయ్" అన్నాడు దగ్గర్లో వున్న పల్లె నుంచి వచ్చిన రాములు.

ఆ మాట వినగానే స్ప్రింగ్‌లా లేచి కూర్చున్నాడు వెంకట్రాజు.

"పందులా? ఏ వేళప్పుడు దిగుతున్నాయ్?" ఎక్సైట్‌మెంట్‌ని కప్పిపుచ్చుకుంటూ హుందాగా అడిగాడు వెంకట్రాజు.

"ఒక్కోసారి ఎలుతురుండగానే వొచ్చేత్తున్నాయి. ఒక్కోసారి తెల్లారగట్ల దిగుతున్నాయి. అటికి అప్పుడు, యిప్పుడూ అని లేదండి" చెప్పాడు రాములు.

"మందలు మందలుగా వస్తున్నాయా? విడివిడిగా వస్తున్నాయా?"

"అలాగా, యిలాగా వొత్తున్నాయి బావ్. ఆ మద్దిన పిల్లల పందికూడా ఒకటి దిగింది బావ్."

"ఎన్నిరోజుల్నుంచి వస్తున్నాయ్?"

"ఎక్కడ బావ్, సానా రోజుల్నుంచి."

"మరిన్నాళ్ళూ ఏం జేసావ్? నా దగ్గర తుపాకీ వుందని నీకు తెల్సుకదా!" చిరాగ్గా అడిగాడు వెంకట్రాజు.

"మొన్న రేత్రి ఒంటిడి గూడా వచ్చినాది బావ్" రాములు

"ఒంటిడా....?!" అదేవిఁటీ అన్నట్టు ఆశ్చర్యపోతూ అడిగాడు వెంకట్రాజు.

"అదేనండి—పోతుపంది."

"ఒహో, అదా!" తన అజ్ఞానాన్ని కప్పిపుచ్చుకుంటూ కాస్త తడబడ్తూ అన్నాడు.

బాగా బలిసిన మగపంది మందని విడిచి ఒంటరిగా తిరుగుతుంటుంది. అందుకే దాన్ని "ఒంటిడి" అంటారనే విషయం మొదటిసారిగా రాములుద్వారానే తెల్సుకున్నాడు.

"ఇంతకీ, ఆ పేసుళనగ చేలెక్కడ?"

"మా యింటి యెనకాలే బావ్. పెద్ద చెరువు ఎనకాల వూరులేదా! అదే మా వూరు."

"మనం కొడ్తే తిరుగుండదు. పందిపడ్తే నువ్వే తీస్కో. దాని గుండెకాయ మాత్రం వేటగాడే తినాలి."

"తమ చిత్తం బావ్:"

* * *

వెంకట్రాజుకు చిన్నప్పట్నుంచీ వేటన్నా వేటాడే మనుషులన్నా ఎంతో యిష్టం. అతని తాతగారు వేటలో సిద్ధహస్తులు. మంచి వేటగాడిగా ఆయనకు చుట్టుప్రక్కల పేరుండేది. తాతగారు చెప్పిన వేటకథలు వెంకట్రాజునెంతో చిన్నతనంలోనే యిన్స్పైర్ చేశాయి. పెద్దయిన తర్వాత తను కూడా పెద్ద వేటగాడిగా పేరు సంపాదించుకోవాలనేదే అతని ఆకాంక్ష. ఎప్పుడూ అడవులూ, అందులో తిరిగే జంతువులమీద ధ్యాసే.

వెంకట్రాజు కాలేజీ చదువుతుండగా అతని తాతగారు కాలధర్మం చేశారు. ఆయన వాడిన తుపాకిని వెంకట్రాజు తండ్రిగారు వెంకట్రాజు ఎంత ప్రాధేయపడినా వినకుండా పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేసేశారు. కారణం-అతని తాతగారికి వేటంటే ఎంత మోజో, తండ్రిగారికి వేటంటే అంత అయిష్టం. పరమ అహింసావాది.



తన తండ్రిగారి వ్యసనం కుమారుని కబ్బినందుకు వెంకట్రాజు తండ్రిగారెంతో విచారిస్తుండేవారు. వేట పరమ కిరాతకమని పరిపరి విధాల కొడుక్కి నచ్చచెప్పి చూశారు. కానీ వెంకట్రాజుకి వేటపై వ్యామోహం నానాటికీ పెరగడమే తప్ప, ఏ మాత్రం తగ్గలేదు.

వెంకట్రాజు డిగ్రీ పూర్తి చేశాక తండ్రితో తగువుపడ్డాడు. మైనారిటీ తీరడంతో ససేమిరా తుపాకీ కావాలని కూర్చున్నాడు. రెండు పూటలు తిండికూడా మానేశాడు. కొడుకు గొడవ భరించలేక తండ్రి "ఫో, నీ కర్మ" అని వదిలేశాడు. వెంటనే వెంకట్రాజు స్వంతంగా లైసెన్స్ సంపాదించాడు. తాతగారి తుపాకిని విజయగర్వంతో డిపాజిట్ నుంచి విడుదల చేయించుకున్నాడు.

అప్పటికే బాగా తుప్పుపట్టిపోయిన ఆ తుపాకితో రెండు రోజులు కుస్తీపట్టి కిరసనాయిల్‌తో క్లీన్ చేశాడు. తూటాలు కొన్నాడు. స్వర్గస్థులైన తాతగారి ఫొటో క్రింద గోడకు రెండు మేకులు దిగ్గొట్టి, వాటికి తుపాకిని తగిలించి, వివిధ కోణాల్లోంచి దాని అందాన్ని తిలకించి మురిసిపోతుండేవాడు. ఇహ వెంకట్రాజుకి మరో పనిలేదు- రోజూ వేటే. కొండల్లో, గుట్టల్లో, తుప్పల్లో, వాగులదగ్గర, చెరువుల దగ్గర ఎక్కడ చూసినా వెంకట్రాజు తుపాకీతో కన్పిస్తుండేవాడు. అచిర కాలంలోనే ఆ వూరిలో మంచి పిట్టల వేటగాడిగా గుర్తింపు పొందాడు. దాంతో అతనిలో గర్వం చోటు చేసుకుంది. పిట్టల వేటనుంచి పులివేటకి వొక్కసారిగా ఎదిగిపోవాలని తహతహలాడిపోతున్నాడు.

* * *

ఆ మధ్యాహ్నం వెంకట్రాజు రాములుతో ఆ చేలున్న ప్రదేశానికి వెళ్ళాడు. అక్కడ పందుల్ని వేటాడ్డానికి మాటు కోసం అనువైన పొదలకోసం చూశాడు. కానీ అవి లేకపోవడంవల్ల మాటుకట్ట

దానికి ఒక చోట గొయ్యిని తవ్వించాడు. వేట కనువుగా దాన్ని తీర్చిదిద్దించాడు. చుట్టూ కంపలతోనూ, తుప్పలతోనూ కప్పాడు. దూరంనుంచి చూడ్డానికి తుప్పల్లో తుప్పలాగే వుంది.

సూర్యుడు కృంగిపోతున్నాడు.

పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నాయి.

ఫ్లాస్కు, టార్చిలైట్, తూటాల్ని కిట్ బాగ్‌లో వెంకట్రాజు సర్దుకున్నాడు. గన్‌ని క్లీన్ చేశాడు. ఇంకా వెల్తురుండగానే రాములు యింట్లో కోడిమాంసంతో భోజనం చేశాడు. చీకటి పడుతుండగా రాములో పందుల వేటకి బయల్దేరాడు. ఇద్దరూ మాటులో దిగి, తిరిగి కొమ్మల్ని నరికిన దొంకల్ని మరొక్కసారి జాగ్రత్తగా అమర్చుకున్నారు.

వెన్నెల విరగగాస్తోంది. ఆ కాంతిలో చెట్లు వింతశోభను సంతరించుకున్నాయి. చలిగా వుంది.

తొమ్మిది గంటలు కావస్తోంది.

పందుల వేట వెంకట్రాజుకి క్రొత్త అనుభవం కావడంచేత అతనిలో కాస్తిగా భయం చోటుచేసుకుంది. కానీ, దానికి మించి ఏదో ఎడ్వంచర్ చెయ్యబోతున్నాననే ఉత్సాహం ఆ భయాన్ని మింగేసింది.

అతనిలో ఎక్సైట్‌మెంట్, థ్రిల్. ఎప్పుడు పందులు దిగుతాయా అనే ఆతృత.

అప్పుడప్పుడు దూరాన కొండల్లో ఏవో అరుపులు, వింతగా, వికృతంగా, భయంకరంగా వినిపిస్తున్నాయి.

చేలలో చిన్న చప్పుడైతే చాలు అతను పులిక్కిపడుతున్నాడు. శరీరం రోమాంచితమవుతోంది. గుండె జల్లుమంటోంది. రివ్వున చలిగాలి వీస్తున్నా అతనికి చిరుచెమటలు పట్టేస్తున్నాయి. కళ్ళల్లో కొవ్వొత్తులు వేసుకొని పరిసరాల్ని ఏకాగ్రతతో పరికిస్తున్నాడు. పరిశీలిస్తున్నాడు.

అర్ధరాత్రి దాటిపోయినా పందుల అలికిడి లేదు. వేట తమకంలో గంటలు నిముషాల్లా దొర్లిపోతున్నాయి. దూరంగా పల్లెలో కోడి కూసింది.

వెంకట్రాజు రేడియం డైల్‌వాచ్ చూసుకున్నాడు. రెండు గంటలయింది.

"బాబుగారూ తుప్పలు కదులుతున్నాయండి" మెల్లగా చెవిలో చెప్పాడు రాములు.

వెంకట్రాజు తన చూపుల్ని తుప్పలపై నిలిపాడు. అవి గాలికి కదుల్తున్నాయి. ఏ జంతువు కనబడ్డంలేదు.

వెన్నెల కృంగిపోతోంది.

వెంకట్రాజుకు నిరాశకలుగుతోంది.

ఇంతలో—

ఆ మసక వెన్నెల్లో ఏదో నల్లని ఆకారం కదుల్తోంది. అడవిపంది, కాదు—ఒంటిడి.... దూరానికి పొదల నీడలమధ్య మరీ పెద్దదిగా కనిపిస్తోంది.

వెంకట్రాజు వొళ్ళు జల్లుమంది. ఎంత పెద్ద పందో!

ఊపిరి బిగబట్టాడు. వొణుకుతున్న చేతుల్ని నిభాయించుకున్నాడు. గన్ సేఫ్టీ కేచ్ తొలగించాడు. తుపాకీ భుజానికి లేచింది.

రాములు ఉద్వేగంతో చూస్తున్నాడు

ధన్—ధన్—రెండు బారక్స్ పేలాయి.

ఆ శబ్దంతో ఆ ప్రదేశమంతా మార్మోగిపోయింది

గురి తప్పలేదు. పంది నేలమీద పడిపోయి దబదబమని తన్నుకొంటోంది. ఉండుండి చిన్న గురక, బుసలు, మరణాయాసం.

సక్సెస్ — గ్రాండ్ సక్సెస్ — తుపాకీని ముద్దుపెట్టుకొని మాటులో లేచి నిలబడ్డాడు వెంకట్రాజు.

రానురాను పొదల్లో శబ్దం తగ్గిపోయింది.

"ఒంటిడి చచ్చిపోయింది — పద" అన్నాడు వెంకట్రాజు.

"ఇంత పెద్ద పందిని నేనెప్పుడూ చూడలేదు బాబోయ్. ఎంత పెద్ద వొంటిదో" అనుకుంటూ రాములు ఆనందం పట్టలేక వెంకట్రాజుకంటే ముందు పరుగెత్తి, తుప్పల్నీ, దొంకల్నీ దాటుకుంటూ పంది పడివున్న దగ్గర కెళ్ళాడు తుప్పలు చిందరవందరగా తన్నేసున్నాయ్. రాములు భయపడ్తూ, భయపడ్తూ మెల్లిగా పొదల్లోంచి చూశాడు.

అంతే—

రాములు నిర్ఘాంతపోయాడు.

వెనుకే వచ్చిన వెంట్రాజు షాక్ తిన్నాడు.

ఆ చచ్చిపడింది గేదె.

"పొట్టి కొమ్ముల్ది, ఇద్ది నా గేదే" గొల్లుమన్నాడు రాములు.

"ఏంటీ! నీ గేదా?!" బిక్కచచ్చిపోయాడు వెంకట్రాజు.

"వారం పది రోజుల కిందే దీన్ని తొమ్మిదొందలెట్టి కొన్నాను. రేత్రి కట్టిడిపోయి చేలో జొరబడి పోనాదిగావాల" ముంచుకొస్తున్న దుఃఖంతో తలపట్టుకొని కుప్పకూలిపోయాడు రాములు. వెనువెంటనే తేరుకొని వెంకట్రాజు మీద విరుచుకుపడ్డాడు.

"చాల్చాల్లేవయ్యా! గొప్ప ఏటకాడివి దొరికేవు. పందని నా ఎయ్యి రూపాయిల గేదను కొట్టేత్తావా? ఆ డబ్బు మర్యాదగిచ్చుకో. లేకపోతే నీ తుపాకి లాగేసుకుంటాను. నా సంగతి నీకు తెల్దు. పంది గుండెకాయ తింటాడట ఏటగాడు" అని చచ్చిపడివున్న గేదెవైపు తిరిగి బాధగా చూస్తున్నాడు.

హఠాత్తుగా—

తుప్పల మీద నుంచి జరజరమని చప్పుడైంది.

రాములు వెనక్కి తిరిగి చూశాడు. ప్రక్కనున్న వెంకట్రాజు లేడు.

"పట్టుకోండి, పట్టుకోండి" పారిపోతున్న వెంకట్రాజు వెనుక పరుగెడ్తూ రాములు అరుస్తున్నాడు.

వెంకట్రాజు తుపాకీ పుచ్చుకొని గుట్టల్నీ, రాళ్ళనీ దాటుకుంటూ, తుప్పల మీద నుంచి, దొంకల మీదనుంచీ ఎగురుకుంటూ ఊరి వైపు దౌడు తీస్తున్నాడు.

తూరుపు కొండల మీద వెలుగు రేఖలు చిక్కబడ్తున్నాయి. ●

బహుళ ప్రచారం పొందిన
అక్షర లక్షలు విలువచేసే
స్వామి - చిన్మయరామదాసు
గారి ఆధ్యాత్మిక గ్రంథములు

| | |
|---|---|
| కైవల్య సాధని | 5.00 |
| క్రోధము—శాంతము | 3-50 |
| క్లేశనివారిణి | 5.00 |
| జీవితధర్మామృతము | 7-50 |
| జ్ఞానాగ్నికణములు | 4-00 |
| దేవతలు—రాక్షసులు | 3-50 |
| సుఖము—దుఃఖము | 5.00 |
| ప్రశ్నోత్తర తారావళి | 3-50 |
| ఆచరణ—అనుభవము | 10.00 |
| భక్తి—భగవంతుడు | 4.00 |

లక్ష్మీ పబ్లికేషన్సు
రామమందిరంవీధి, గవర్నరుపేట
విజయవాడ—520 002

* అడ్వాన్సు అందగానే—మిగిలిన డబ్బుకు V.P.P. పెట్టి పంపుతాము. వివరములకు వ్రాయండి.

RAIJO